www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 జూన్ 2025

5

అన్నమయ్య

రైతు సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

బాధ్యతలు చేపట్టిన కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్ : రైతు సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నూతనంగా మదనపల్లె మండల వ్యవసాయ శాఖ అధికారిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు. గతంలో ఇక్కడ వ్యవసాయ అధికారిగా పనిచేసిన నాగ ప్రసాద్ వాల్మీకిపురానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో నవీన్ కుమార్‌రెడ్డి వచ్చారు. గతంలో మదన పల్లెలో సేవలందించడంతో రైతులకు సుపరిచితులుగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులతో మమేకమై ప్రభుత్వ ఆదేశాలు మేరకు సంపూర్ణ అవగాహన కల్పిస్తూ వ్యవసాయ కేలెండర్ అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. వ్యవసాయంలో సాగు మెలకువలను, రైతులకు అందిస్తూ, వారికి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధంగా అవగాహన తీసుకువస్తామన్నారు. సిబ్బందితో సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడూ సకాలంలో రైతులకు అవసరమైన సమాచారం అందిస్తామని వెల్లడించారు.

తల్లికి వందనం సమాచారం అడిగిన వారిపై డిజిటల్ అసిస్టెంట్ దాడి

- బాధితులకు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రజాశక్తి- బి.కొత్తకోట

తల్లికి వందనం పథకంపై సమాచారం అడిగిన, ఎల్‌పి నెంబర్లు విషయం అడిగిన వారిపై డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బుధవారం మండలంలోని గుమ్మసముద్రం గ్రామంలో చోటుచేసుకున్న ఘటనపై బాధితులు తెలిపిన వివరాల మేరకు... ఒడిగిలవారిపల్లికి చెందిన నాగభూషణం, అనూరాధ, శంకరప్ప తదితరులు గుమ్మసముద్రంలోని సచివాలయానికి వెళ్లి తల్లికి వందనం డబ్బు పడిందా, లేదా అని వివరాలు తెలుసుకోవడానికి వెళ్లారు. డబ్బు పడిందా లేదా అని మాట్లాడడంతో మరో వ్యక్తి రీసర్వేలో ఎల్‌బి నెంబర్లు విషయంలో అధిక మొత్తం తీసుకుంటూ కూడా పనులు చేయ లేదని అడగడంతో ఆగ్రహించిన సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్ దాడి చేసి ముగ్గురిని గాయపరిచాడు. గాయపడ్డ వారిలో ఒడిగిలవారిపల్లెకు చెందిన నాగభూషణం, అనూరాధ, శంకరప్పలు ఉన్నారు. బాధితులను 108 సిబ్బంది వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీస స్టేషన్‌లో గాయపడ్డ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గతంలో పెద్దతిప్పసముద్రం మండలంలో డిజిటల్ అసిస్టెంటుగా విధులు నిర్వహించిన బాబా ఫక్రుద్దీన్ పలువురుపై దురుసుగా ప్రవర్తించి పలుమార్లు సస్పెండ్ అయ్యాడని, అప్పటి వైసిపి ప్రభుత్వంలో తన పలుకుబడితో తిరిగి ఉద్యోగంలో చేరాడు. ఈ విషయంపై సంఘటనా స్థలానికి వచ్చిన ఎఎస్ఐ భాస్కర్ నాయక్ డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్‌తో మాట్లాడుతూ ఇంకా కూడా నువ్వు మారలేదని గతంలో పిటిఎం మండలంలో నీప్రవర్తన ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా చూసిన వాడిని మరల ఇక్కడ ప్రజలపై దాడి చేస్తావా అని నిలదీశారు. సమాచారం అడిగిన ప్రజలపై దాడి చేసిన డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్‌ను సస్పెండ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దాడి చేసిన బాబా ఫక్రుద్దీన్

గాయపడిన నాగభూషణం, అనూరాధ, శంకరప్ప

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- ధర్నాలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమణ

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె మున్సిపాలిటీలో ఐదేళ్లగా పనిచేస్తున్న దినసరి పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న ఐదు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వి.రమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులపై చిన్న చూపు చూడడం తగదన్నారు. కరోనా కష్టకాలంలో పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలకు తెగించి పనులు చేపట్టారని, ఆ సమయంలో మదనపల్లె మున్సిపాలిటీలో 80 మంది కార్మికులను అదనంగా తీసుకొని పనులు చేయించు కున్నారని పేర్కొన్నారు. ఐదు నెలలుగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే వాళ్ళ కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలో నెలకు రూ.లక్షలు, రూ.వేలల్లో జీతాలు తీసుకునే అధికారులు ఉన్నారని, వారికి ఒక్క నెల జీతం రాకపోతే అతలాకుతలమవుతారన్నారు. నెలంతా కష్టపడి రూ.14 వేలు జీతం తీసుకుంటున్న పారిశుధ్య కార్మికుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. వీరికి ఈ పని తప్ప వేరే కార్యకలాపాలు ఏమీ లేవని, దీనిపైనే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అలాంటి కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా నెలలు తరబడి బకాయిలు పెడితే వాళ్ళ కుటుంబం ఎలా గడవాలో అధికారులు, పాలకులే చెప్పాలన్నారు. ఇంటికి అద్దె చెల్లించకపోవడంతో సమస్య, కిరాణా కొట్టులో సరుకులు దొరకక సమస్య, పిల్లలను పాఠశాలకు పంపించలేని సమస్య, విధులకు వెళ్లాలన్న రానుపోను ప్రయాణ ఖర్చులు లేక సమస్య, ఇదివరకే తీసుకున్న అప్పు తీర్చలేక సమస్య, కొత్త అప్పు పుట్టక మరో సమస్య ఇలా ఇన్ని ఆటుపోట్లు దాటుకొని పనులు చేస్తున్నా, అధికారులు నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. దినసరి పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పారిశుధ్య కార్మికులందరికీ ఇంటి పట్టాలు ఇస్తామని స్థలాలు కేటాయించారన్నారు. ఇంతవరకు పట్టాలు మంజూరు చేయలేదన్నారు. పట్టాలు లేకుండా ఇల్లు ఎలా నిర్మించుకోవాలో అధికారులే చెప్పాలన్నారు. వెంటనే ఇంటి నిర్మాణాలకు అనుగుణంగా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులు 15 రోజులుగా కార్యాలయం ముందు టెంట్ వేసుకొని నిరసన తెలియజేస్తున్నా అధికారులు కానీ, నాయకులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వారి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించి నిరసన విరమింప జేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులందరూ ఐక్యమై సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్మిక సోదరులందరూ కుటుంబ సభ్యులతో సహా ఐక్యంగా పోరాటాలకు సిద్ధమై రాబోయే రోజుల్లో నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. తద్వారా పాలకుల మెడలు వంచి మన సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం కమిషనర్ ప్రమీలను కలిసి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ యూనియన్ కన్వీనర్ రామకృష్ణ, సభ్యులు అరవింద్, రాజ, నాయక్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌కు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి వార్తలకు స్పందన

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన మలంషావలికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డిఇఒ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళ, బుధవారాల్లో ప్రజాశక్తిలో 'మధ్యాహ్న భోజనంలో పరుగులు', 'మళ్లీ పురుగుల బియ్యంతో భోజనం' అనే శీర్షికలతో వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ వార్తలకు స్పందించిన డిఇఒ మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మలం షావలికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ షోకాజ్ నోటీసులకు ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించినట్లు చెప్పారు. ప్రిన్సిపల్ ఇచ్చే వివరణను ఆర్‌జెడికి పంపుతామని, దీనిపై వనతాధికారులు చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ విద్యార్థుల కడుపు కొడుతూ వారికి ఇచ్చే బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు తీసుకెళ్లడంపై కడప ఆర్‌జెడికి స్థానిక పాఠశాల కమిటీ చైర్మన్ కె.రమేష్ నాయుడు ఇప్పటికే ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మదనపల్లి డివైఇఒ పాఠశాలను తనిఖీ చేయడానికి రానున్నట్లు తెలిపారు.

ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా గోవింద్ : ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా గోవింద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గతంలో పనిచేసిన ప్రిన్సిపల్ మలం షావలి బదిలీపై వెళ్లాడు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గోవింద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు మహమ్మద్ షాకీర్, యువరాజు ఎర్రవారిపాలెం మండలానికి, మంజు ప్రవీణ, షర్ఫుద్దీన్ లక్కిరెడ్డిపల్లి మండలానికి, ఎల్‌ఎల్‌ఎన్.స్వామి సంబేపల్లెకు, కె.పల్లవి కుప్పం, సుమతి కె.వి.బి.పురం మండలాలకు బదిలీపై వెళ్లినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ తెలిపారు. కలకడ ఆదర్శ పాఠశాలకు ఎర్రవారిపాలెం నుండి వసుంధర, సంబేపల్లి మండలం నుండి సాయినాథ్ ,షాహిదా, కె.వి.పల్లి నుండి వెంకటసుబ్బయ్య, సతీష్ కుమార్, పెద్దమండెం నుండి గౌసియా, సత్యసాయి జిల్లా నుండి బషీర్ అహ్మదులు బదిలీపై వచ్చారు. వీరందరూ స్థానిక పాఠశాలలో రిపోర్ట్ చేసుకున్నారు.

బోధనలో నూతనత్వంతో నాణ్యమైన విద్య

- డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు

మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు

ప్రజాశక్తి-రాయచోటి

వినూత్న పద్ధతుతో బోధన చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు అన్నారు. బుధవారం మధ్యాహ్నం మోటకట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుల బోధనా విధానాలను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోటకట్ల హైస్కూల్‌ను డైట్ పరిశోధనా పాఠశాలగా తీసుకొని విద్యార్థులలో గుణాత్మక విద్యను పెపొందిస్తామన్నారు. ఇందుకోసం ఆధునిక బోధనా పద్ధతులను ఇక్కడ అమలు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులలో మెరుగైన అభ్యసన ఫలితాలను సాధించేందుకు డైట్ అధ్యాపక బృందం తమ సహకారాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించేటప్పుడు శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలన్నారు. పాఠ్యపుస్తకాలలోని కఠిన భావనలను డిజిటల్ విధానంలో బోధించడం ద్వారా విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించవచ్చన్నారు. ఈ సందర్భంగా డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ మోటకట్ల హైస్కూల్‌ను దత్తత తీసుకుని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ బోధనా విధానాలను అమలు చేయడం జరుగు తుందన్నారు. విద్యను అందించడంలో రోల్ మోడల్‌గా పాఠశాలను తీర్చిదిద్దుతామన్నారు. నాణ్యమైన విద్య కోసం పరిసర ప్రాంత తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చప్పిడి పద్మజ, డైట్ అధ్యాపకులు శివ భాస్కర్, శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు చిదంబరరెడ్డి, నాగేశ్వర్ నాయక్, భాస్కర్, బిఎస్ పద్మావతి, నరసింహులు, వేణు మాధవరాజు, ప్రసాదరాజు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి : ఎస్‌ఎఫ్‌ఐ

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కేరళలోని కోజికోడ్‌లో ఈ నెల 27వ తేదీన జరిగే అఖిలభారత ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ కోరారు. బుధవారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉద్యమ స్ఫూర్తి, అమరవీరుల వారసత్వంతో 1970లో కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భవించిందని తెలిపారు. స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యంగా అలుపెరగని పోరాట ప్రయాణంలో 55 వసంతాలు పూర్తి చేసుకుందని, 50 లక్షల సభ్యత్వంతో దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా రూపుదిద్దుకుందన్నారు. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ కోసం ఈ నెల 27 నుండి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరిగే అఖిలభారత మహాసభలకు తెలుగు రాష్ట్రం నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో కార్పొరేటీకరణ, కాషాయీకరణ, కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు కార్యాచరణ కోసం జరిగే ఈ మహాసభలకు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్మోహన్, నాయకులు అశోక్, నవీన్, రామ్ చరణ్, మనోజ్, విష్ణు, బాలాజీ, గురుతేజ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మణి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తిరుపతిలో చికిత్స పొందుతున్నారు. ఆయన చికిత్స నిమిత్తం బుధవారం రాజంపేట ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు వెంకటరమణ ఆధ్వర్యంలో తహశీల్దార్ పీర్‌మున్నికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మణి ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలిపారు. తమ సంఘం తరపున మరింత సాయం అందించేందుకు దాతలను అభ్యర్థిస్తున్నామని పేర్కొన్నారు. దాతలు ముందుకు వచ్చి బాధితుడికి సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, ఎన్‌జిఒ సంఘం నాయకులు టి.కుమారస్వామి, ఎస్.సాదక్ బాషా, ఎ.మణికంఠ, రమణారావు, రాఘవులు, రెవెన్యూ సిబ్బంది, బాధితుల బంధువులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు నగదు అందజేస్తున్న ఎన్‌జిఒ నాయకులు

తల్లికి వందనం అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

తల్లికి వందనం దేశచరిత్రలో సరికొత్త అధ్యాయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తల్లికి వందనం దేశచరిత్రలో సరికొత్త అధ్యాయమని, ి ప్రజలకు సిఎంచంద్రబాబు నాయుడు సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం మదనపల్లె పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి తల్లికి వందనం విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. ఏడాది కాలంలోనే పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, మెగా డిఎస్‌సి వంటి హామీలను అమలు చేసి ప్రజల చేత ప్రశంసలు అందుకుంటుందోన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఇంటిలోని ఒక విద్యార్థికి మాత్రమే అమ్మఒడి అమలు చేస్తే ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం అందించి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించారన్నారు. ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి సమన్వయంతో పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే వైసిపి నాయకులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విమర్శలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు. ఐదేళ్ల కాలంలో వైసిపి నాయకులు రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిస్థితులను చక్కదిద్దుతున్నారని ప్రశంసించారు. ఇక మదనపల్లి నియోజకవర్గంలో ఏడాది కాలంలోనే అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మరి ముఖ్యంగా మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, ఇదే స్ఫూర్తితో పనిచేసి మదనపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రపథాన నిలుపుతామనిస్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా నక్కలదిన్నె గంగమ్మ జాతర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని నక్కలదిన్నెలో వెలసిన గ్రామదేవత శ్రీ గంగమ్మ జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా స్థానిక కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు నిస్సార్ అహమ్మద్‌కు ఘన స్వాగతం పలికారు. ఆయన అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకముందు తాండా ప్రజల ఆరాధ్య దైవం సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్ తండ్రిని పరామర్శించి, అక్కడే విందు భోజనం చేశారు. కార్యకర్తలతో సమావేశమై ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వంపై ప్రజలలో వ్యక్తమౌతున్న అభిప్రాయాలు, పథకాల అమలులో జగన్మోహన్ రెడ్డి కి, చంద్రబాబునాయుడు మధ్య ఉన్న తేడా, ప్రజలలో ఎలాంటి చర్చలు జరుగుతున్నాయో ఆరా తీశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, అమరేంద్ర నాయక్, మంజుల, హరీష్ నాయక్, స్వామి నాయక్, కాలేషా, రాఘవ నాయక్, మహేష్ నాయక్, కొత్తపల్లె మహేష్ బాబు, నాగమణి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దారును సన్మానిస్తున్న రేషన్ డీలర్ల సంఘం సభ్యులు

30లోపు పెండింగ్ ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఈనెల 30లోపు పెండింగ్ ఇకెవైసిని పూర్తి చేయాలని, 65 ఏళ్ళ పైబడిన వారికి ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తహశీల్దారు కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. మదనపల్లె మండలంలో రేషన్ డీలర్లతో తహశీల్దార్, సిఎస్‌డిటి ఫిరోజ్ బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న పెండింగ్ ఇకెవైసిని పూర్తి చేయాలని ఆదేశించారు. 65 ఏళ్ళ పైబడిన వారికి ఈనెల 26 నుండి 30 వరకు ఇంటి వద్దకే నిత్యావసర సరకులు పంపిణీ చేయాలన్నారు. సిఎస్‌డిటి మాట్లాడుతూ ప్రతి డీలర్ ప్రభుత్వ నిబంధనలు మేరకు సకాలంలో లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలన్నారు. స్టోర్ నిర్వహణలో సమయ పాలన పాటించాలని సూచించారు. డీలర్లంతా బాధ్యతగా విధులు నిర్వహించి మండలానికి జిల్లాలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డిని అన్నమయ్య జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలాలి శాలువ, పుష్ప గుచ్చంతో సన్మానించారు. సమావేశంలో డీలర్లు రఘు, కళాధర్, ఖాజా హుస్సేన్, సుధీర్ బాబు, ఇమామ్, మురళి, కిషోర్, క్రాంతి కుమార్, భాగ్యమ్మ, నయీం తాజ్, బేబీ, రమణమ్మ, సహనాజ్ బేగం పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని బాలల సంరక్షణ అధికారి పి.రామలక్ష్మి తెలిపారు. బుధవారం ప్రభుత్వ జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలోనూ, చెర్రీస్ స్కూల్‌లోనూ బాల్య వివాహాలు, బాల బాలికలపై లైంగిక వేధింపులు, అక్రమ రవాణా తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ అధికారి మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని, వారికి రెండేళ్ల పాటు జైలు శిక్ష, రూ లక్ష జరిమానా విధిస్తారన్నారు. బాల్యవివాహాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాల బాలికల మధ్య లింగ వివక్ష లేకుండా సమానంగా చూడాలని సూచించారు. సెల్ ఫోన్ వాడడం వల్ల పిల్లల్లో కలిగే దుష్ఫలితాలు గురించి వివరించారు. కార్యక్రమంలో చెర్రీస్ స్కూల్ కరస్పాండెంట్ ప్రేమలత, ఎన్‌జిఒ రెడ్స్ కో-ఆర్డినేటర్ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- రాయచోటి : జిల్లాలో 19 ఆశావర్కర్ల పోస్టుల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉషశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్, కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు జిల్లాలో ఖాళీగా ఉన్న 19 పోస్టుల భర్తీ చేయనున్నట్లుగా పేర్కొన్నారు. ఇందులో గ్రామీణ స్థాయిలో 17, పట్టణ ప్రాంతాల్లో 2 పోస్టులు భర్తీ చేస్తారన్నారు. అభ్యర్థి సంబంధిత గ్రామంలో నివసిస్తూ, పెళ్లి అయిన లేదా వితంతువు లేదా విడాకులు తీసుకున్న లేదా భర్తతో విడిపోయి జీవిస్తున్న వారై ఉండాలన్నారు. వయసు 25 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలు ఉండే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు కనీసం పదవ తరగతి పాస్ అయి ఉండాలని పేర్కొన్నారు. అర్హతలు annamayya.ap.gov.in వెబ్సైట్‌లో అందుబాటులో ఉన్న దరఖాస్తు ఫారాన్ని నింపి రాయచోటిలోని మాసాపేటలో గల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి కార్యాలయంలో ఈనెల 26 లోపల సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పేర్కొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో భాగంగా ఈనెల 21న రాయచోటి, జిల్లా వ్యాప్తంగా నిర్వహించే యోగా కార్యక్రమానికి విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, జిల్లా అధికారులు, స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, మండల ప్రత్యేక అధికారులు, ఆర్‌ఐలు, మండల సర్వేయర్లు, విఆర్‌ఒలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్స్, ఎస్‌పిడిసిఎల్ అసిస్టెంట్స్, ఎఎన్‌ఎంలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులపై దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల మందితో ప్రత్యక్షంగా రెండు కోట్ల మందితో పరోక్షంగా రాష్ట్రవ్యాప్తంగా యోగా చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పే విధంగా చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమంలో పాల్గొనే విధంగా చూడాలని అన్నారు. యోగా సాధన చేయడం వల్ల ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా దృఢమై ఆరోగ్యవంతంగా ఉంటారు. ఫలితంగా ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ ఏర్పడుతుంది. 21న విశాఖపట్నంలో నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో దేశ ప్రధానమంత్రి పాల్గొంటారు. ఇప్పటికే మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించారని చెప్పారు. మండల, గ్రామస్థాయిలో కొంతమంది ఉద్యోగులను గుర్తించి శిక్షణలో ఇచ్చారని చెప్పారు. ఇప్పటికే వెన్యూలను గుర్తించి యోగ కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రెవెన్యూ ఇన్‌చార్జులను నియమించామన్నారు. రాబోయే మూడు రోజుల్లో మున్సిపాలిటీ మండల గ్రామ స్థాయిలలో ప్రతిరోజు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రతి వెన్యూలో 150 మందికి తగ్గకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమానికి ఉదయం 7 గంటల నుండి 7.45 గంటల వరకు విశాఖపట్నంలో నిర్వహించడం జరుగుతుందని అదే సమయానికి జిల్లా స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ఈనెల 19న హార్సిలీ హిల్స్‌లో నిర్వహించే యోగా ప్రోగ్రాంకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని మదనపల్లి సబ్ కలెక్టర్ కు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఆర్‌డిఒ ఎడి సర్వే, డిఎంహెచ్ఒ, వ్యవసాయ శాఖ ఏడీ, జిల్లా అధికారులు, స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

రాయచోటి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం అన్నదానం చేశారు. గాలివీడు మండలం తలముడిపి గ్రామానికి చెందిన గండికోట సుబ్బారెడ్డి వర్ధంతి పురస్కరించుకొని కుటుంబ సభ్యులు మండలం బండపల్లి పంచాయతీలోని ప్రేమాలయంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కుటుంబంలో ఎలాంటి వేడుకలు జరిగిన సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు లైన్స్‌క్లబ్ సహకారంతో చేపడతామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్, వినోద్ కుమార్ నాయక్, గండికోట సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు భాగ్యలక్ష్మి, జయమ్మ, వెంకటరెడ్డి, ప్రేమాలయం మేనేజర్ సుబ్బయ్య దేవనాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఇ గోవింద్‌రెడ్డి

ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు సబ్సిడీతో సోలార్ రూఫ్ టాప్‌లు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ములకలచెరువు డిప్యూటీ ఎగ్జిక్యూట్ ఇంజినీర్ గోవింద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని వారి ఇళ్లపైనే సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు అధిక మొత్తంలో సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. ఒబిసిలు సైతం ఇంటిపై ఏర్పాటు చేసుకుంటే సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల ఎఇ గిరిధర్‌రెడ్డి, లైన్‌మెన్లు, రైతులు, సోలార్ కావాల్సిన వారు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ మనోహర్

రుణాలు సక్రమంగా చెల్లించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

స్వయం సహాయక సంఘ సభ్యులు రుణాలు సక్రమంగా చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్లు మనోహర్, నాగేశ్వరరావు కోరారు. బుధవారం మండల వెలుగు మహిళా సమాఖ్యలో కార్యాలయంలో వీరబల్లి గ్రామ సమాఖ్య-2 కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ సభ్యులు తీసుకొన్న రుణాలతో జీవనోపాధులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణాలతో పాటు యూనిట్లను బట్టి వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. సభ్యులు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు ఆధార్, మొబైల్ నంబర్లతో లింక్ చేసుకోవడం తప్పనిసరని తెలిపారు. సంఘాల సీనియారిటీని బట్టి రూ.20 లక్షలు రుణాలు ఇస్తున్నామన్నారు. ఎపిఎం మాట్లాడుతూ సభ్యులందరు బయో మెట్రిక్, ఎఫ్ఆర్ఎస్. పూర్తి చేసుకోన్నప్పుడే ప్రభుత్వం అందించే రాయితీలకు అర్హత ఉంటుందన్నారు. గ్రామీణ బ్యాంకులన్నీ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పడిన తర్వాతా వడ్డీలు తగ్గించారన్నారు. అదనపు ఛార్జీలను తగ్గించడం, రుణాలు బయో మెట్రిక్ విధానం ద్వారా సులభతరమయ్యాయన్నారు. కార్యక్రమంలో సిసి నాగేంద్ర, సమాఖ్య అధ్యక్షులు గులాబ్ జాన్, కోశాధికారి రమణమ్మ, విఒఎ కవిత, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

ఆటోలకు ధ్రువపత్రాలు తప్పనిసరి : ఎస్ఐ

ప్రజాశక్తి - నందలూరు

ఆటో డ్రైవర్లు తమ వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్లో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా తమకు ఏర్పాటుచేసిన స్టాండ్ లోనే నిలబెట్టాలని ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్ల పై ఉందని అన్నారు. తనిఖీల సమయంలో రికార్డ్సు లేకపోతే జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి : రాయచోటి

O.S.No. 310/2021

అల్లు శివకుమార్ నాయుడు, S/o రంగయ్యనాయుడు, వయస్సు 44 సం॥, వ్యవసాయం, R/o సాయన్నగారిపల్లి (V), H/o టి.సుండుపల్లి and మండలం, అన్నమయ్య జిల్లా, Present R/at D.No.20.2.553B, మారుతినగర్, కొర్లకుం ట, తిరుపతి టౌన్, బాలాజి జిల్లా.

...ప్లైయిన్‌టిఫ్

Vs

1. అల్లు రామ్, నారాయణ నాయుడు, S/o లేట్ రామయ్య నాయుడు, వయస్సు 43 సం॥లు, వ్యవసాయం.

...2వ డిఫెండెంటు

2. అల్లు లక్ష్మినారాయణనాయుడు, S/o లేట్ రామయ్య నాయుడు, వయస్సు 41 సం॥లు, వ్యవసాయం.
R/o సాయన్నగారిపల్లి, H/o Sundupalli and మండలం, అన్నమయ్య జిల్లా.

...3వ డిఫెండెంటు

పై తెలిపిన ప్లెయిన్‌టిప్ మీ ఇరువురి పైన (అనగా 2&3 ప్రతివాదులపై) మరియు 4 మంది పై సివిల్ ఒరిజినల్ సూట్ దాఖలు చేసి ఉన్నారు. సదరు ఒరిజినల్ సూట్ పై తెలిపిన కోర్టు నందు 20.06.2025వ తేదీన వాయిదా ఉన్నందున మీరు నేరుగా గానీ లాయరు ద్వారా గానీ పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవచ్చును. అట్లు లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

సి.పవన్ కుమార్ రెడ్డి, B.Com., L.L.B.,
అడ్వకేట్,
రాయచోటి.

తోతాపురి మామిడి రకానికి సబ్సిడీ

- జిల్లా ఉద్యాన అధికారి ఎస్.ఎస్.వి.సుభాషిణి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

తోతాపురి మామిడి రకానికి ప్రభుత్వం మద్దతు ప్రకటించిందని, మామిడి రైతులకు కిలో రూ.4 ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్.ఎస్.వి సుభాషిణి పేర్కొన్నారు. బుధవారం మదనపల్లి పట్టణంలోని మామిడి మండీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోతాపురి మామిడికాయలను తోటలలో దించిన తర్వాత మనకి దగ్గర్లో ఉన్న జ్యూస్ ఫ్యాక్టరీకి కానీ లేదా పక్క జిల్లాల జ్యూస్ ఫ్యాక్టరీకి కానీ పంపిస్తే వారికి కిలోకు రూ.4 చొప్పున ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ప్రభుత్వం ఈ మద్దతును ఆగస్టు వరకు కొనసాగిస్తుందని, కావున రైతులు తొందరపడి పక్వానికి రాని కాయలు కోయవద్దని, కేవలం పక్వానికి వచ్చిన కాయను మాత్రమే పలు దఫాలుగా కోయాలని సూచించారు. మొత్తం కాయలు ఒకేసారి కోయడం వల్ల జ్యూస్ ఫ్యాక్టరీ దగ్గర రద్దీ పెరిగి కాయలు దించుకోడానికి పట్టే సమయం ఎక్కువ అవుతుందన్నారు. కనుక ఈ విషయంలో రైతులు సహకరించాలన్నారు. రైతు నేరుగా ఫ్యాక్టరీకి కానీ, లేదా మండి దగ్గరకు కానీ, ఎఫ్‌పిఒ వద్దకు కానీ కాయలను తీసుకెళ్లాలన్నారు. తమ వెంట ఇటీవల తీసిన 1బి, ఆధార్, ఆధార్ లింక్డ్ బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలతో వెళ్లాలన్నారు. అక్కడ విధుల్లో ఉన్న అధికారుల (రెవిన్యూ మరియు అగ్రికల్చర్, హార్టికల్చర్ సహాయకులు) వద్ద రైతు వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వారు కూడా రైతు వివరాలు, పంట వివరాలు నమోదు చేసుకుంటారన్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర మొత్తం ప్రభుత్వం విడుదల చేసినపుడు నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తారన్నారు. . రైతులు తమ కాయలు కోసే ముందే వారికి అనుకూలమైన ఫ్యాక్టరీ, మండి యాజమాన్యంతో ఒకసారి మాట్లాడి, జ్యూస్ ఫ్యాక్టరీ దగ్గర రద్దీ తెలుసుకొని కాయలను కోయడం వల్ల రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా

మదనపల్లె : మండీలో మామిడి పంటను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

రామాపురం : మండీని పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి సింధూరి

ఉంటారన్నారు. మరిన్ని సమాచారం కోసం మీ గ్రామంలోని రైతు సేవా కేంద్రాలలో కానీ లేదా ఉద్యాన అధికారులను కానీ సంప్రదించి మీ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

రామాపురం : మామిడి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందని లక్కిరెడ్డిపల్లి డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి పి.సింధూరి పేర్కొన్నారు డివిజన్ పరిధిలోని మామిడికాయల మండీలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ తోతాపురి (బెంగుళూరు)రకంను చిత్తూరు, తిరుపతి, రైల్వేకోడూరు జ్యూస్ ఫ్యాక్టరీలలో రూ.8 కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అదనంగా రూ.4 కలిపి ఇస్తుందని చెప్పారు. రైతులు ధరల గురించి ఆందోళన చెందవలసిన పనిలేదన్నారు. కాయ పక్వానికి వచ్చిన తర్వాత మాత్రమే కోత కోయాలని సూచించారు. కోతకు ముందుగా రైతులు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రంలోని సిబ్బందిని గాని, ఉద్యానవన శాఖ అధికారులు గాని సంప్రదించి తగు పత్రాలను పొందాలన్నారు. కోత చివరి దశలో వరకూ ఈ పథకం అమలు చేయడం జరుగుతున్నారు. కార్యక్రమంలో విఎఎ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రైతుల పాల్గొన్నారు.

మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు : ప్రభుత్వం అందించే సహాయక ప్రోత్సాహకాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి టి. సుకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు తోతాపురి మామిడి కాయలు కోసి తమకు దగ్గరలోని జ్యూస్ ఫ్యాక్టరీ, ఎఫ్‌పిఒ, రాంపు లేదా మండికి జ్యూస్ కోసం పంపే వారికి కిలో రూ.4 వంతున ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని చెల్లిస్తుందని అన్నారు. తోతాపురి మామిడి కాయల చివరి కోత వరకు కూడా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలియజేశారు.

పాడి పరిశ్రమతోనే ఆర్థికాభివృద్ధి : జెడి

ప్రజాశక్తి - వీరబల్లి

పాడి పరిశ్రమతోనే రైతుల కుటుంబాలు ఆర్థికంగా మెరుగుపడతాయని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పెళ్లై తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాలను పరిశీలించారు. అక్కడ పాడి ఆవుల రైతులకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమలతో, పాడివుల పెంపకంతో , ఆవుల పోషణతో, పేద రైతులు, పేద ప్రజలు ఆర్థికంగా మెరుగుపర్చడానికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. పాడివులకు ముందు జాగ్రత్త చర్యలుగా రైతులు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. అందుకు అన్నమయ్య జిల్లాలో ఎక్కడా పశు వైద్యశాలలో టీకాల కొరత లేకుండా చూస్తున్నామన్నారు. పశు వైద్య సిబ్బంది ద్వారా పశువులకు ఎటువంటి జబ్బులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలుగా గ్రామాలలో టీకాలు వేయిస్తామని చెప్పారు. ప్రస్తుతం వర్షం మీద ఆధారపడిన రైతులు ప్రస్తుతం ఇబ్బంది పడుతున్నారు. ఆర్థికంగా కుటుంబ జీవన కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అటువంటి రైతులు పాడి పరిశ్రమలు నిర్మించుకొని పాడివుల ద్వారా పాలు అమ్ముకొని ఆర్థికంగా మెరుగుపడి జీవనం సాగించవచ్చునని తెలిపారు. గొర్రెలు, మేకలు మేపుకొని ఆర్థికంగా కూడా అభివృద్ధి చెందవచ్చు అన్నారు. ముఖ్యంగా పశువులకు మేకలకు గొర్రెలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఆయన చెప్పారు. ప్రదాదాల ద్వారా గాని ఆరోగ్యం బాగాలేక పశువులు, గొర్రెలు మరణించినట్లయితే ఇన్సూరెన్స్ ద్వారా ఆ రైతుకు డబ్బులు వస్తాయని చెప్పారు. ప్రతి రైతు నాటు జాతి పశుపు ఒక్కొక్క ఆవుకు రూ.150 చెల్లించి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గుణశేఖర్

ఇన్సూరెన్స్ పొందాలన్నారు. పది ఆవులకు ఒకే రైతు పేరు మీద ఇన్సూరెన్స్ చేసుకోవచ్చున్నారు. శంకర జాతి పశువుకు రూ.300 ఇన్సూరెన్స్ చేసుకోవాలని చెప్పారు. మండల కేంద్రంలో పనిచేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ నాగరాజు బదిలీ మీద చిన్నమండెం వెళ్లారు.. చిన్నమండెం మండలంలో పనిచేస్తున్న డాక్టర్ గణేష్ ఇక్కడకు వచ్చారు. వారిని జెడి శాలవాలతో పూలదండలతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ార్యక్రమంలో డిడి మాలకొండయ్య , ఏడీలు విజయ్ కుమార్, శ్రీధర్ రెడ్డి డాక్టర్లు రవికుమార్, నాగరాజు, గణేష్, పశు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?

- మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి తిమ్మారెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

మామిడి రైతులు బాధలు రోజు రోజుకు తీవ్రమవుతున్నాయని, మామిడి రైతుల కన్నీళ్లను కూటమి ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదని ఉమ్మడి రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి మండిపడ్డారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, సంవత్సరం కాలం పాటు కష్టించి, చమటోడ్చి, శ్రమించి, అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి, మామిడి పంట చేతికి వచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేక, కొనుగోలు చేసేవారు లేక, అన్నదాత కన్నీరు పెడుతున్నాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.8, రూ.4 చెప్పిన ఆదేశాలు ఎక్కడ అమలు కాలేదన్నారు. గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో జైన్ గుజ్జు పరిశ్రమ వద్దకు దాదాపు మూడు కిలోమీటర్ల మేర రైతులు మామిడికాయలను ట్రాక్టర్లలో తీసుకెళ్లి నాలుగు రోజులుగా పడిగాపులు పడుతున్నా, ఫ్యాక్టరీ యాజమాన్యంలో కాని, ప్రభుత్వంలో కాని, కనీస స్పందన లేక పోవడం గమనార్హం అన్నారు. నిద్ర, తిండి లేక రోడ్లపై ఇబ్బందులు పడుతున్న రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నా, ఈ ప్రభుత్వానికి కనీసం చీమకుట్టి నట్లు కూడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మామిడి పంటను పూర్తిగా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించపోతే ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నల్లారి శ్రీకర్‌రెడ్డి, నియోజవర్గం సమాచార హక్కు చట్టం అధ్యక్షులు మద్దిరాళ్ళ మల్లికార్జున, మండల పార్టీ ఉపాధ్యక్షులు వేంపల్లి బావాజీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు వేంపల్లి ఖాదర్బాషా, ప్రధాన కార్యదర్శి శివాయోగి జగన్నాథ్ కుమార్, విద్యార్థి నాయకుడు మల తోటి నరేష్, సోషల్ మీడియా అధ్యక్షులు వి.భాను ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం : డిపిఎం

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభదాయకమని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డిపిఎం) బి.వెంకటమోహన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాల్‌ను డిపిఎం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన యూనిట్ పరిది లోని ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఇలాంటి సమాచారం కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఆయన ఎపిసిఎన్ఎఫ్ క్యాడర్లు-యూనిట్ ఇన్‌ఛార్జులు, ఐసి ఆర్‌పిలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయం ప్రగతి పైన రివ్యూ చేశారు. ముఖ్యంగా ప్రీ-మాన్సూన్ డ్రైసోయింగ్ (పిఎండిఎస్) విధానాన్ని ప్రతి రైతు అమలు చేయాలని పిలుపునిచ్చారు. మామిడి తోటలలో 30 రకాల పంట విత్తనాలను కలిపి విత్తడం వలన నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, జీవవైవిధ్యాన్ని పెంచడంలో సహాయపడుతుందని, నేలలో తేమ శాతం నిల్వ ఉంటుందని , నేలను కోతకు గురికాకుండా చేస్తుందని, పిఎండిఎస్ వలన మిత్ర పురుగులు పెరిగి శత్రు పురుగులను అరికడుతుంది, పశువులకు మేతగా కూడా ఉపయోగ పడుతుం దన్నారు. వేరుశనగ పంటలో అంతర పంటలుగా కందులు, అలసందలు, అనప, అముదం, జీవ వైవిధ్య పంటలుగా 20 రకాల విత్త నాలను విత్తాలని సూచించారు. ఇవి వర్షభవ పరిస్థితిలో వేరుశనగ పంట నుండి దిగుబడి రాకపోయినా అంతర పంటల ద్వారా అదనపు ఆదాయాన్ని రైతులకు కలిగిస్తాయని, ప్రధాన పంటకు పురుగులు, తెగుళ్ల రాకుండా అరికడతాయి అని వివరించారు. గట్ల వెంబడి కంచే పంటలుగా జొన్న, సజ్జ, మొక్కజొన్న పంటలను వేసుకొని పంటలను పురుగుల నుండి రక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎంటిఎల్ చందు రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసులు, పద్మావతి, ఇంటర్న్లు, యూనిట్ ఇంచార్జీలు మరియు ఐసిఆర్‌పి పాల్గొన్నారు. తరువాత ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులకు సలహాలు ఇచ్చారు. గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేసి, రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా ప్రతి వ్యవసాయ కుటుంబం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలంటూ పిలుపునిచ్చారు.

గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తంబళ్లపల్లి

గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెల వైద్య పరీక్షలు చేసుకోవాలని తంబళ్లపల్లి ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి తేజశ్విని సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ముఖ్యమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తేజశ్విని మాట్లాడుతూ గర్భిణులు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేసుకుంటూ పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఆహారంలో గుడ్లు, ఆకుకూరలు, పాలు, చిరుధాన్యాలు వంటివి భాగంగా చేర్చుకోవాలన్నారు. ప్రభత్వాసుపత్రుల్లో ఆధునిక, వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, అన్ని వసతులతో సాధారణ ప్రసవాలు చేసా రన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పు అయితే తల్లి, బిడ్డ క్షేమంగా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో హెడ్ నర్సు గ్లోరి, సిబ్బంది పాల్గొన్నారు.

పాల డెయిరీ వ్యర్థాలు వదలకుండా చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె మండలంలోని కోసువారిపల్లెలో శ్రీజ మిల్క్ డెయిరీ నుంచి వచ్చే పాల వ్యర్థాలను పైప్‌లైన్ ద్వారా మురికికాలువల్లోకి వదులుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన భరించలేకున్నామని ఈగలు, దోమల బెడద ఎక్కువై రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. డెయిరీ కాంపౌండ్‌లోని సోక్ పిట్‌లోకి వదిలేలా చూడాలని కోరుతున్నారు.

రక్తదానం చేస్తున్న యువకుడు

రక్తదానానికి యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి-రాయచోటి

రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని హెల్పింగ్ హాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ మైనుద్దీన్ అన్నారు. బుధవారం సుండుపల్లె మండలం రాయవరంకు చెందిన ప్రసవ సమయంలో బిడ్డ చనిపోగా అత్యవసర సమయంలో ఓ గర్భిణికి ఓ పాజిటివ్ రక్తం అవసరమైది. రక్తం కోసం హెల్పింగ్ హాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్‌ను సంప్రదించారు. యూసుఫ్ అనే యువకుడు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ మైనుద్దీన్ మాట్లాడుతూ ఎదుటి వ్యక్తి ఆపదలో ఉంటే ఈ రోజుల్లో మాకెందుకు అని పక్క నుండి వెళ్లిపోయే రోజులని తెలిపారు. ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం ఇవ్వడానికి ముందుకు రావాలని చెప్పారు. రక్తం ఇవ్వడంలో ఎటువంటి ఇబ్బంది, హానికరం ఉండదని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన యూసుఫ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహమ్మద్, సుఫియాన్, జావీద్, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ ఐటిఐలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈ నెల 20న ప్రాంగణ నియామకాలు చేపట్టనున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ రామమూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ ఐటిఐ కళాశాలల్లో పరీక్షలు రాయబోతున్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాంగణ నియామకాలకు హాజరయ్యే విద్యార్థులను వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై వారి కంపెనీలకు అనువైన వారిని ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఎంపిక అనంతరం సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు పొందుతారని అన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన ఐటిఐ అభ్యర్థుల సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని తెలియజేశారు.

'మల్లయ్య కొండ'లో 'కనుగొండ' ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయాని బుధవారం మల్లయ్య కొండ మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త కనుగండ మద్దిరెడ్డి సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునులు ఆయనకు స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మల్లయ్య కొండ దిగువన ఉన్న వెలుగు మల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. పూజారి శేఖర్ అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పలువురు అభిమానులు ఉన్నారు.

కష్టపడిన వారికి ప్రాధాన్యత ఉంటుంది

ప్రజాశక్తి - తంబళ్లపల్లి : పార్టీలో కష్టపడిన వారందరికీ తగిన గుర్తింపు ఉంటుందని టిడిపి తంబళ్లపల్లె మండల అబ్జర్వర్ రెడ్డెప్ప అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాల యంలో తంబళ్లపల్లె-1, 2, గోపిదిన్నె, ఆర్ఎన్ తాండ, గ్రామాల టిడిపి శ్రేణు లతో సమీక్ష జరిపారు. నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీలు, సమస్యలపై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో అన్ని గ్రామాల వారితో సమీక్ష జరిపి మండల కమిటీని ఎన్నుకుని ఆదిష్టానానికి పంపుతామన్నారు.

ఎంసి చైర్మన్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-పీలేరు : పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన పురం రామమూర్తిని ప్రజా సంఘాలు ఘనంగా సత్కరించాయి. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో వారు చైర్మన్‌ను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి దగ్గర రాజకీయంగా తనదైన ముద్ర వేసుకుని, ప్రజాదరణ పొందిన నాయకుడిగా గౌరవప్రదమైన పదవిలో కొనసాగడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తూ, అందరి పట్ల అభిమానం చూపుతూ, ఆప్యాయంగా పలకరిస్తూ, ఎవరు పిలిచినా పలికే స్వభావమున్న వ్యక్తి పురం రామమూర్తి అని, ఇలాంటి పదవి ఆయనకు దక్కడం సంతోషంగా ఉందని అన్నారు. చైర్మన్ రైతులకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, అందరికి అందుబాటులో ఉంటూ తగు న్యాయం చేస్తారన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగిరిమడుగు సుభాష్, వెంకటేష్, సుధాకర, ముల్లంగి చంద్రయ్య, దుబ్బా శ్రీకాంత్, అంజి, భాను ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.

ఎంసి చైర్మన్‌ను సత్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

క్రైం కార్నర్

నిందితుల అరెస్టును చూపుతున్న అటవీ అధికారులు

అడవి పందుల అక్రమ రవాణా గుట్టురట్టు

ప్రజాశక్తి-వీరబల్లి

అడవి పందులను చంపి తీసుకెళున్న వారిని పట్టుకుని అరెస్టు చేశారు. బుధవారం మండలంలోని సానిపాయి పంచాయతీలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వైసిరెడ్డి సమాచారం మేరకు ఎర్రచేను ప్రదేశం నుంచి రెండు అడవి పందులను చంపి గోన సంచిలో ఉంచి రాయచోటి వైపు తీసుకెళ్తున్న వారిని చెక్ పోస్ట్ దగ్గర తనిఖీ నిర్వహిస్తుండగా పట్టుకున్నారు. ద్విచక్ర వాహనంలో వెళుతున్నా నాగరాజు, జగనాదం బాలులను పట్టుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఫాస్ట్ రేంజ్ ఆఫీసర్ వైసిరెడ్డి మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా, అడవి జంతువులు పరిరక్షణ కోసం, గట్టి నిఘా ఉంచమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన మైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలు సానిపాయి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, జాండ్రపెంట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.